జీపీ భవనాలకు స్థలాలు కరువు

- ఏళ్ల తరబడి మంజూరైన నిధులు రద్దు
- ఇబ్బందిగా కార్యాలయాల నిర్వహణ
- మండలంలో ఐదు పంచాయతీల్లో అవస్థలు

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకంలో ప్రతీ గ్రామానికి నూతన భవనాన్ని మంజూరు చేశారు. లింగాలఘణపురం, చీటూరు, కొత్తపల్లి, పటేల్‌గూడెం, జీడికల్ గ్రామాలతో పాటు నెల్లుట్ల, కళ్లెం, నాగారం, సిరిపురం, బండ్లగూడెం, కుందారం, కిష్టగూడెం, మంథోనిగూడెం, మాణిక్యాపురం గ్రామాల్లో 2016లో ఉపాధి హామీ పథకంలో రూ.13 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. లింగాలఘణపురం, చీటూరు, కొత్తపల్లి, పటేల్‌గూడెం, జీడికల్ మినహా మిగిలిన గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టారు. కానీ లింగాలఘణపురం, చీటూరు, కొత్తపల్లి, పటేల్‌గూడెం, జీడికల్‌లో స్థలాల ఇబ్బందితో నిర్మాణాలు చేపట్టలేదు. అప్పట్లో అధికారంలో ఉన్న సర్పంచ్‌లు నిధులు రద్దు కావద్దనే ఉద్దేశంతో స్థలాలు సరిగా ఉన్నాయా లేవా అనే అంశాలను ఏమీ పట్టించుకోకుండా శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోనైతే గతంలో ఉన్న గ్రామ పంచాయితీ ప్రహరీగోడకు శంకుస్థాపన శిలాఫలకం వేశారు. అనంతరం మళ్లీ మరో రూ.3 లక్షలు అదనంగా రూ.16 లక్షలతో మంజూరు ఇచ్చారు. అప్పుడు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చిన ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు దొరలేదు. చీటూరులో పనులు ప్రారంభించేందుకు ముందుకు వచ్చిన స్థల వివాదంతో ఆ పనులే ప్రారంభించలేదు. ఇలా లింగాలఘణపురం, జీడికల్, చీటూరు, కొత్తపల్లి, పటేల్‌గూడెం గ్రామాలకు ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులు రద్దు చేశారు.



చీటూరు గ్రామ పంచాయతీ భవనం



ప్రహరీకి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఇబ్బందిగా కార్యాలయాల నిర్వహణ

పంచాయతీ కార్యాలయాల నిర్వాహణ గతంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనాల్లో నిర్వహించడంతో ఇబ్బందిగా మారుతోంది. సరైన గదులు లేకపోవడం, ఉన్న గదులు వర్షాలకు కురవడం జరుగుతుంది. చీటూరులో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పెంకుటిల్లు ఇరుకైన భవనంలోనే వర్షాలకు ఫైల్స్ తడుస్తున్నా విధిలేని పరిస్థితుల్లో కొనసాగిస్తున్నారు. ఇక మండల కేంద్రం, కొత్తపల్లి, జీడికల్, పటేల్‌గూడెం గ్రామాల్లో స్లాబులు ఉన్న ఏనాడో నిర్మించిన పాత భవనాలతో ఇబ్బందిగా నిర్వహిస్తున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పంచాయతీ ఆఫీసు ఇప్పుడు పెంకలు పోయి కురుస్తోంది. గతంలో పనులు మొదలు పెట్టారు. శంకుస్థాపన రాయి వేసి వదిలేశారు. ప్రస్తుతం అక్కడే నిర్మించే అందరికి అందుబాటులో ఉంటుంది.

– నోముల యాదయ్య, చీటూరు

పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు

- ఎంఈఓ కొమురయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: 2025–26 విద్యాసంవత్సరంలో పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఎంఈఓ కొమురయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించేలా విద్యాశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. మండలానికి 28,146 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 21,560 పుస్తకాలు జిల్లా గోదాం నుంచి మండల కేంద్రానికి చేరాయని, త్వరలో మిగిలిన పుస్తకాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ జడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం ఎం.సంపత్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, సునీత, మమత, లవన్, జ్యోతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ కొమురయ్య

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు జనగామ కలెక్టరేట్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఘన్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికే ఇస్తున్నారని, కాంగ్రెస్ నేతల ఇండ్లలోనే లబ్ధిదారుల జాబితాను తయారు చేస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు రేషన్ బియ్యం అందిస్తున్నారన్నారు. రేషన్‌షాపుల వద్ద, రేషన్‌కార్డుల పైన ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు ఇల్లందుల సారయ్య, దీగోజు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, ఎల్లస్వామి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లడం సిగ్గుచేటు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెళ్లడం సిగ్గుచేటని, ఏనాడు దళితవాదాన్ని ఎత్తుకోని ఆయన దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకే వెళ్లాడని మాజీ ఎమ్మెల్యే రాజయ్య మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏనాడు దళితవాదాన్ని అంబేద్కరిజాన్ని, దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడని ఆయన ఎలా మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తారని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాసు, మహిళ నాయకురాలు భాగ్యలక్ష్మి, గండి యాదగిరి, ఏదునూరి వీరయ్య, కరుణాకర్, విష్ణు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

‘ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే సహించం’



మాట్లాడుతున్న నర్సయ్య తదితరులు

లింగాలఘణపురం: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మాజీ ఎమ్మెల్యే రాజయ్య విమర్శిస్తే ఇక సహించమని నేలపోగుల మాజీ ఎంపీటీసీ నర్సయ్య, వడిచర్ల మాజీ సర్పంచ్ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వెళ్లి ఎమ్మెల్యే కడియంను తామే ఆహ్వానించామని అన్నారు. ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేస్తే మాదిగలమే రాజయ్యను ఊళ్లలోనికి రానీయమని హెచ్చరించారు. సంపత్, చాడ రాములు, రాంచందర్, ఉపేందర్, పరశురాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ విద్యుత్ తీగల మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



విద్యుత్ వైర్‌కు మరమ్మతులు చేసిన అధికారులు

జనగామ: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఈదురు గాలులతో తెగిపడిన సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ వైరుకు ఎన్పీడీసీఎల్, పురపాలిక అధికారులు సంయుక్తంగా మరమ్మతు చేసి ప్రమాదం జరుగకుండా చర్యలు తీసుకున్నారు. ‘నేలను తాకిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ వైరు’ శీర్షికన ఈ నెల 26న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎన్పీడీసీఎల్ ఏఈ సౌమ్య ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం వైర్‌కు మరమ్మతు చేపట్టి, ఎలాంటి ప్రమాదం జరుగకుండా ప్లాస్టిక్ పైపును అమర్చారు. ఏఈ సౌమ్య మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్ సిస్టం వైర్లకు సంబంధించి పురపాలిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచనలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బచ్చన్నపేట: బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం వాసంతి తదితరులు

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని బండనాగారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వాసంతి అన్నారు. సోమవారం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు ఇజ్జగిరి సిద్దయ్య, సంపత్‌కుమార్, ఏఏపీసీ చైర్ పర్సన్ ఇజ్జగిరి బాల్‌లక్ష్మి, అటెండర్ సిద్దిని నర్సింహులు, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహులు, ఈశ్వరమ్మ, పోశాలు, సత్తయ్య, బాల్‌రాజు, బాల ఎల్లయ్య, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, యాదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

పాలకుర్తి టౌన్: బడి బయట ఉన్న బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి. శోభారాణి అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న

రఘునాథపల్లి: అర్హులకు కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మండల కార్యదర్శి కావటి యాదగిరిలు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఎనిమిది ఏళ్ల క్రితం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎండీ మోహిస్సాన్‌ముజ్జబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేశం, సీపీఐ నాయకులు పసుల దానియేలు, నాల్కపల్లి దావీద్, గొంగళ్ల వెంకటయ్య, సుధాకర్, కవిత, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం అయిన సంఘటన మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. రాత్రి 2.30 గంటల సమయంలో ఇంట్లో ఏదో కాలిపోతున్న వాసన రాగా మెలకువ వచ్చి చూడగా ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోతూ కనించాయి. దాదాపు 40 ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, మిక్సీలు, టీవీలు, లైట్లు ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. గ్రామంలోని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ 15 రోజులుగా షార్ట్‌సర్క్యూట్ అవుతోందని సంబంధిత అధికారులకు వివరించినా పట్టించుకోలేదన్నారు. షార్ట్‌సర్క్యూట్‌లో ప్రాణహాని జరగలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయాలని గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు, సురేష్, భిక్షపతి, సాయికుమార్, గాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, పోచయ్య, నర్సింహులు కోరారు.

బాలుడి అప్పగింత

పాలకుర్తి టౌన్: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో తప్పిపోయిన బాలుడిని స్థానికులు పోలీస్‌స్టేషన్ అప్పగించారు. విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో అబ్బాయి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన రూపేష్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి డేవిడ్ పాలకుర్తి పోలీస్ స్టేషన్ రావడంతో పోలీసులు బాలుడిని అప్పగించారు. పాలకుర్తి చర్చికి రాగా బాలుడు తప్పిపోయాడని బాలుడి తండ్రి తెలిపారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు రమేశ్

దేవరుప్పుల: పరిపాలన మార్పుకోసం కాంగ్రెస్‌కు మద్దతు పలికిన తమ పార్టీ ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటం చేపట్టడం అనివార్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నేటి (మంగళవారం) నుంచి ప్రారంభమయ్యే సీపీఎం జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, నాయకులు చింత మైసయ్య ,గోసంగి శంకరయ్య, శీను, సారయ్య, చంద్రమౌళి, పోశయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

- పార్టీ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామ రూరల్: ఈనెల 27, 28, 29 తేదీల్లో దేవరుప్పుల మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం జనగామ– హైదరాబాద్ సౌత్ జిల్లాల నాయకత్వ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగుతుల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. అహల్య, సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, బిట్ల గణేష్, పల్లెర్ల లలిత, బూడిద ప్రశాంత్, చీర రజిత, బూడిద అంజమ్మ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎలీషా

జనగామ రూరల్: ఈనెల 31వ తేదీన తలపెట్టిన ‘చలో వరంగల్’ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ విభాగాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఎలీషా మాట్లాడుతూ ఢిల్లీలో పద్మశ్రీ అవార్డు తీసుకుని 31వ తేదీన వరంగల్‌కు విచ్చేయుచున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నర్సయ్య , సోమశేఖర్, కుమార్, మహేష్, నగేష్ పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపులు



స్టేషన్‌ఘన్‌పూర్: చిన్నారులతో హెచ్‌ఎం తదితరులు



పాలకుర్తి: ఈరవెన్నులో మాట్లాడుతున్న హెచ్‌ఎం



రఘునాథపల్లి: సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/రఘునాథపల్లి/పాలకుర్తి: స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీఎస్‌ఎస్, మోడల్ కాలనీలోని ఫ్యూచర్ మైండ్ స్కూల్, హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోమళ్ల, ఈరవెన్ను, బమ్మెర పాఠశాలల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఎంఈఓ, హెచ్‌ఎంలు మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. విద్యార్థులకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్యారమ్స్, చెస్, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా దోహదపడతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ కొమురయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ రాపర్తి రమ, హెచ్‌ఎంలు నరేందర్, సందెల నవీన్, మంగు జయప్రకాశ్, నర్సింహులు, ఎం.సంపత్, ఏఏపీసీ చైర్ పర్సన్ లావణ్య, ఇన్‌స్ట్రక్టర్లు కుమార్, కీర్తన, శర్మిష్టదేవి, మంజుల, స్రవంతి, లక్ష్మీ, రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న రమ


చికిత్స పొందుతున్న బాలుడి మృతి

దాతల సహకారంతో అంత్యక్రియలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 23వ తేదీన తీవ్ర కడుపునొప్పితో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేరిన నిరుపేద కుటుంబానికి చెందిన బోనాల కార్తీక్(6) ఆదివారం మృతిచెందగా స్థానికుల సహకారంతో బాలుడి అంత్యక్రియలు చేపట్టిన సంఘటన సోమవారం జరిగింది. మృతుడి తాత బోనాల బలరాం స్థానిక పోలీసుస్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిరుపేద అయిన బలరాం కొన్నేళ్ల క్రితం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సైదవారి కుంట సమీపంలో ఓ పూరిగుడిసె వేసుకుని తన కుమార్తె అంజలి, మనువడు కార్తీక్‌తో నివాసం ఉంటున్నాడు. బలరాం కూలీపనులు చేస్తుండగా అంజలి, అతడి కుమారుడు కార్తీక్ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈనెల 23న మధ్యాహ్నం బాలుడు కార్తీక్ గుడిసెలో పడుకుని ఉన్నాడు. ఒక్కసారిగా తీవ్రంగా కడుపునొప్పి వ స్తుందని, మంటగా ఉందని పిల్లవాడు చెప్పడంతో ఏదైనా విషపురుగు కుట్టి ఉంటుందని భావించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు బలరాం తెలిపాడు. కాగా, సోమవారం అతడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందించారు. కాగా, బాలుడి మృతదేహం వద్ద తాత, తల్లి కన్నీరుమున్నీరుగా విలపించిన సంఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

దాతల సహకారంతో అంత్యక్రియలు

నిరుపేద అయిన బలరామ్‌కు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో మనువడి అంత్యక్రియలు చేసేదెలా అని ఆవేదన చెందగా విషయం తెలుసుకున్న స్థానికుడైన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు చింత జగదీష్ ప్రత్యేక చొరవతో ఘన్‌పూర్‌కు చెందిన దాతలు, యువతకు సమాచారం అందించి వారి సహకారంతో బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు.



కార్తీక్ మృతదేహం



రోదిస్తున్న బాలుడి తల్లి

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

పాలకుర్తి టౌన్: తెలంగాణ సాంస్కృతిక సారథిలో అసలైన ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ కళావేదిక ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుగ్గిల్ల ఎల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగానికి 12 సంవత్సరాలుగా ఎదరు చూసి ఆత్మహత్య చేసుకున్న పాలమూరు నృత్య కళాకారుని నట్టల స్వప్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మచార్ల రమేష్, డప్పు సోమన్న, సునిల్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కళాకారులు

క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.66 వేలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

నర్మెట: మండలకేంద్రంలోని అతిపురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో పునర్నిర్మాణంలో భాగంగా నూతన ఆలయాన్ని నిర్మించారు. కాగా, సోమవారం హుండీ లెక్కింపు చేపట్టగా మూడు నెలల ఆదాయం రూ.65,992లు వచ్చింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగిటి అంజయ్య, రంగరాజు వెంకట రమణారావు, దన్నారపు మురళి, కొండ బాలయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్, కల్లూరి గణేష్, బైరోజు ఉపేందర్, కొన్నె తిరుపతి, ప్రజ్ఞాపురం నర్సింహులు, పూజారి పార్నంది సతీష్ శర్మ పాల్గొన్నారు.

ఐక్య క్రైస్తవ పండుగ



ప్రసంగీకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిల్పూరు: నష్కల్ గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఐక్య క్రైస్తవ పండుగలు ఆదివారం రాత్రి ముగిశాయి. బాప్టిస్టు చర్చి సంఘం పాశం రాజు ఆధ్వర్యంలో నాలుగు సంఘాలు పండుగ నిర్వహించాయి. ఈ సందర్భంగా ముఖ్య ప్రసంగీకులు పులి శ్యాంసుందర్ మాట్లాడుతూ క్రైస్తవులు ఐక్యత చాటుకోడానికి నాలుగు చర్చి సంఘాల క్రైస్తవులు ఒకే వేదికపై నిర్వహించుకోవడం శుభప్రదమన్నారు. ముగింపు సందర్భంగా ముఖ్య ప్రసంగీకులు శ్యాంసుందర్, బొజ్జ కిష్టఫర్, పుల్ల సామ్యూల్, ఫెలోషిప్ డైరెక్టర్ తాటికొండ జోసఫ్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్, శాగంటి యోనా, ప్రకాష్, కిషన్, అరూరి ప్రణీత్, శాగంటి మణి, మొగిళి, పేతురు, రాకేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

చిల్పూరు: ఫత్తేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగంగేశ్వరి ఆలయంలో సోమవారం ఆలయ నిర్మాణ దాత, శాశ్వత అర్చకులు వేల్పుల లక్ష్మీగట్టయ్య వేద మంత్రాల నడుమ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురువాలంటూ శివలింగానికి జలాభిషేకం చేశారు.


‘ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం’

జఫర్‌గఢ్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అనేక మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నాయకులు సింగారపు రమేష్, గొలుసుల లింగయ్యయాదవ్, విగ్నేష్, రాజు, దుద్దుల చంద్రమౌళి, కుంభం చంద్రమౌళి పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎంల మండల కార్యవర్గం ఏకగ్రీవం

దేవరుప్పుల: మండలంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు, రాష్ట కార్యదర్శి బుర్ర రమేశ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా జి.శంకరయ్య(కోలుకొండ), ప్రధాన కార్యదర్శిగా నల్ల లలిత (మాధాపురం), గౌరవ అధ్యక్షురాలుగా ఎం.పద్మరాణి(పెద్దమడూరు), ఉపాధ్యక్షులుగా సీహెచ్ రమాదేవి (మాధాపురం), కోశాధికారిగా మరియాల మాధవి(చిన్నమడూరు), కార్యదర్శిగా వై పద్మావతి(కామారెడ్డిగూడెం)లు ఎన్నికయ్యారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పురోగతి, అపరిష్కృత సమస్యల సాధన కోసం నూతన కార్యవర్గం పాటుపడుతామని ప్రతిజ్ఞ చేసింది.

పశువుల వాహనం పట్టివేత



బచ్చన్నపేట: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై హమీద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన ఎండీ.నజీర్, అన్వర్, వాహన డ్రైవర్ వాజిద్‌లు బొలేరో వాహనంలో ఆవులు, దూడలను అక్రమంగా తీసుకెళ్తుండగా ఇటుకాలపల్లి గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. బక్రీద్ పండుగకు పశువులను తీసుకెళ్లుతున్న వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.